# గ్రామాల్లో ఉత్సాహంగా బీఆర్ఎస్ ప్రచారం



మహదేవపూర్ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మల్హర్ : ఎడ్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

- **ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థన**
- **పార్టీ మ్యానిఫెస్టో ప్రతుల పంపిణీ**
- **కారు గుర్తుకే ఓటెయ్యాలని వినతి**
- **కాంగ్రెస్‌వి గ్యారెంటీ లేని పథకాలు**

మహదేవపూర్, నవంబర్ 24 : మండలంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతున్నది. శుక్రవారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గడపగడపకూ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ మ్యానిఫెస్టో ప్రతులు పంపిణీ చేశారు. కారు గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, సర్పంచ్ శ్రీపతిబాపు, ఏఎంసీ చైర్ పర్సన్ మమతా మనోహర్, ఉప సర్పంచ్ సల్మాన్‌ఖాన్, ఎంపీటీసీ పద్మా ఓదెలు, కే గీత, స్వప్న, కే దేవేందర్, సర్పంచ్‌లు కిష్టయ్య, మల్లక్క, చిన్న మల్లయ్య, నాగుల లక్ష్మారెడ్డి, నాయకులు అన్కారీ ప్రకాశ్, అన్కారీ ప్రభాకర్, పీ వెంకటస్వామి, కే బాపురావు, అలీంఖాన్, కే రాకేశ్, ఇబ్రహీం, సాజిద్ అలీ, ఎల్ రామయ్య, లక్ష్మణ్, డీ రవీందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### చేన్లలో ఎన్నికల ప్రచారం

మండల కేంద్రం శివారు పొలాల్లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైతులు, కూలీలకు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అన్కారీ ప్రకాశ్ , సాగర్ల రవీందర్, కాళేశ్వర ఆలయ ధర్మకర్త దేవేందర్, యూత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మెరుగు శేఖర్, కొక్కు పున్నం, కార్యకర్తలు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

### వచ్చేది కేసీఆరే.. అభివృద్ధి చేసేది పుట్ట మధునే

మల్హర్ : మండలంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, వాల యాదగిరిరావు, మహిళా మండల అధ్యక్షురాలు పంతకాని చంద్రకళ, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి సుమన్, గ్రామ అధ్యక్షుడు పంతకాని వెంకట్ రాజు అధ్వర్యంలో ప్రచారం చేశారు. పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను వివరిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం పుట్ట మధూకర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్‌వి గ్యారెంటీ లేని పథకాలని విమర్శించారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మంథని బాపు, రాధా శ్రీనివాస్, స్వరూపా రమేశ్, పుట్ట మధు యువసేన మండల అధ్యక్షుడు పిలమరి నరేశ్, నాయకులు తోట సత్యనారాయణ, మంథని బుచ్చయ్య, తోట రాజ సమ్మయ్య, వేల్పుల రాజేందర్, కుక్కల రాజబాబు, కునారపు శ్రీనివాస్, జనగామ రాజేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మహాముత్తారంలో..

మహాముత్తారం : మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు మంథనిలో పుట్ట మధును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధూకర్

## బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న చేరికలు

### పార్టీలోకి ఆహ్వానించిన పుట్ట మధూకర్

మహదేవపూర్, నవంబర్ 24 : బీఆర్ఎస్‌లోకి చేరికల పర్వం కొనసాగుతుంది. మంథని పట్టణంలోని రాజగృహలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ సమక్షంలో మండల అధ్యక్షుడు, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు పార్టీలో చేరారు. అంబట్‌పల్లి గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ తోపుచర్ల సులోచన, కాంగ్రెస్ నాయకులు వావిలాల రాజేశ్వరి, పుట్ట స్వామి, వావిలాల రాజన్న, వావిలాల వెంకన్న, ఎనగందుల పోచన్నతో పాటు 20 మంది, అలాగే మండల కేంద్రానికి చెందిన వార్డు సభ్యుడు భీముని వెంకటస్వామి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పుట్ట మధూకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పుట్ట మధును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కూరతోట రాకేశ్, కొక్కు రాకేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్ప భక్తుల వేషంలో వసూళ్లు

ఏటూరునాగారం, నవంబర్ 24 : అన్నదానం, పడి పూజకు విరాళాలు అందించాలని అయ్యప్పస్వామి నకిలీ భక్తులు ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయి మండలాల్లో వసూళ్లకు పాల్పడ్డారు. ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై తిరుగుతూ చందాలు వసూలు చేస్తున్నారు. వీరు ఏటూరునాగారంలో శుక్రవారం దుకాణాలు, ఇంటింటా తిరుగుతూ విరాళాలు అడుగుతున్నారు. కొంత మందికి అనుమానం వచ్చి నిలదీశారు. దీంతో వారు తప్పు ఒప్పుకున్నారు. రూ. 75వేలు వసూలు చేశారు. వారిని గ్రామస్తులు పీఎస్‌లో అప్పగించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మహదేవపూర్, నవంబర్ 24 : ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రమోద్ కుమార్ సూచించారు. శుక్రవారం అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామాల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. మురుగు నీరు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మషూక్ అలీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యా సామర్థ్యాలను పెంచాలి

ఏటూరునాగారం, నవంబర్ 24 : మండలంలోని చిన్నబోయినపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఐటీడీఏ ప్యానెల్ టీం తనిఖీ చేసింది. పాఠశాలలో విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే కార్యాలయం, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని ఉపాధ్యాయులకు ప్యానెల్ టీం సూచించింది. విద్యార్థుల గ్రేడింగ్ వివరాలను సేకరించారు. మధ్యాహ్న భోజనంలో అమలు చేస్తున్న మెనూను పరిశీలించారు. ప్యానెల్ టీం ఇన్‌చార్జి సావిత్రి, హెచ్ఎం సారంగపాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షంతో రైతులు ఆందోళన

వెంకటాపూర్/కన్నాయిగూడెం, నవంబర్ 24 : మండలాల వ్యాప్తంగా గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు చిరుజల్లులు కురిశాయి. వరి పంట చేతికొచ్చే సమయంలో వర్షం రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంత రైతులు వరి కోయగా వడ్లు తడవకుండా టార్పాలిన్ కవర్లు, పరదాలు కప్పి కాపాడుకుంటున్నారు. కోతకు వచ్చిన పొలాలు వర్షం పడడంతో ఆలస్యంగా కోయాల్సి వస్తుందని రైతులు తెలిపారు. పత్తి దెబ్బ తింటుందని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. వానకాలం ఆరంభంలో కురిసిన భారీ వర్షంతో దెబ్బతిన్న రైతులు పంటలు చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాల వల్ల మరోసారి నష్టపోతున్నారు.

### ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం : మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా వాతావరణం చల్ల బడింది. మిర్చి తోటలకు వర్షం అనువుగానే ఉన్నా కోతకు వచ్చిన పంట రైతులు ఇబ్బంది పడ్డారు. కల్లాలపై ఆరబోసిన ధాన్యాన్ని పరదాలు కప్పి కాపాడుకున్నారు. వర్షంతో రోడ్లపై నీళ్లు నిలిచాయి. గంట పాటు వర్షం జోరు గా కురిసింది.



వెంకటాపూర్ : ధాన్యంపై పరదాలు కప్పుకున్న రైతులు

## రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

### తండ్రి పరిస్థితి విషమం

తాడ్వాయి, నవంబర్ 24 : బైక్‌ను స్కూల్ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ఏడాది చిన్నారి యశ్విత మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నార్లాపురంలో శుక్రవారం కాత రమేశ్ తన కూతురిని తీసుకుని కిరాణా షాప్‌లో సరుకులను కొనుగోలు చేసి ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో పస్రాలోని సెయింట్ మేరీ స్కూల్ వ్యాన్ మేడారంలో విద్యార్థులను ఎక్కించుకుని పస్రాకు బయలుదేరింది. నార్లాపురంలో ముందు వెళ్తున్న బైక్‌ను వ్యాన్ ఢీకొట్టింది. చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ముద్దులొలికే చిన్నారి మృతితో బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. వ్యాన్ బ్రేకులు ఫెయిల్ కావడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

## ఏజెన్సీలో మావోయిస్టుల సంచారం

వాజేడు, నవంబర్ 24 : ములుగు జిల్లాలో మావోయిస్టు యాక్షన్ టీం ప్రవేశించినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలను భగ్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. మావోయిస్టుల కదలికలపై ప్రత్యేకంగా నిఘా పెట్టి డ్రోన్‌కెమెరాలతో పాటు వాహనాల తనిఖీ, గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు.

## గోదావరికి కార్తీక పంచ హారతి

కాళేశ్వరం, నవంబర్ 24 : ముక్తీశ్వర ఆలయం అధ్వర్యంలో కార్తీక మాసం రెండోరోజూ శుక్రవారం ఆలయ అధికారులు, అర్చకులు గోదావరి మాత కు పంచ హారతి ఇచ్చారు. మంగళ వాయిద్యాలు, అర్చకుల వేద మంత్రాల నడుమ గోదావరి వద్దకు వెళ్లి గోదావరి మాతకు వాయనం ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు గోదావరి మాతకు దీపాలు వదిలారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్, ధర్మకర్తలు అడప సమ్మయ్య, రాంరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 1/70 చట్టాన్ని సవరించాలి

### సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు

మంగపేట, నవంబర్ 24 : 1/70 చట్టాన్ని సవరించి గిరిజన, గిరిజనేతరుల మధ్య సామరస్యతను కాపాడాలని సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర్‌రావు కోరారు. మండలంలోని బోరునర్సాపురంలో శుక్రవారం గిరిజనేతరుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1/70 చట్టం అనేది గిరిజనులు ఎక్కువగా ఉండి, వారు వెనుకబడ్డ పరిస్థితుల్లో అమలు చేయాల్సిన చట్టమన్నారు. ఏయే ప్రాంతాల్లో 50 శాతం గిరిజనులుంటారో ఆప్రాంతాలను మాత్రమే షెడ్యూల్ ప్రాంతాలుగా గుర్తించాలని దేబర్ కమిషన్ పేర్కొన్నదని తెలిపారు. మంగపేటలోని మొత్తం జనాభాలో గిరిజనలు మూడో వంతు కూడా లేరని గుర్తు చేశారు. దేబర్ కమీషన్ నివేదక అమలు చేస్తే మంగపేటతో పాటు, షెడ్యూల్-నాన్‌షెడ్యూల్ సమస్యలు తీరిపోతాయని తెలిపారు. 1/70 చట్ట ప్రకారం గిరిజనేతరుల భూక్రయ, విక్రయ లావాదేవీలు నిలిపి వేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. 1/70 చట్టాన్ని సవరించి అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గిరిజనేతర ఐక్య వేదిక నాయకులు పరికి శ్రీనివాస్, పగిడిపల్లి చంద్రం, మంగపేట, తాడ్వాయి గిరిజనేతర నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మంగపేట, నవంబర్ 24 : మండలంలోని కమలాపురంలో మ్యాక్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష్మీనర్సింహస్వామి రైతు మిత్ర ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం రైతులు, సెంటర్ ఇన్‌చార్జి అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర పొందాలన్నారు. ఏగ్రేడ్ ధాన్యానికి రూ2,203, సాధారణ రకానికి రూ.2,183 ధర కల్పించినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర అధ్యక్షుడు రాణాప్రతాప్‌రెడ్డి, పీ హరిబాబు, బీ యాదగిరి, కే శ్రీనివాస్, హన్మంతరావు, డీజే రాజేశ్, కొట్టు వెంకటేశ్వర్లు, వీ సత్యం, పీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి




మహదేవపూర్ : పెద్దంపేటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

- **ఎస్సై రాజ్ కుమార్**
- **పెద్దంపేటలో ఫ్లాగ్ మార్చ్**

మహదేవపూర్, నవంబర్ 24 : ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రాజ్ కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామంలో సీఆర్పీఎఫ్ కమాండెంట్, పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

### కాటారంలో..

కాటారం : మండల కేంద్రంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ చేశారు. సీఐ రంజిత్‌రావు నేతృత్వంలో పోలీస్ బలగాలు యూత్ ట్రైనింగ్ సెంటర్ నుంచి మండల కేంద్రంలోని పలు వీధులు, పోలీస్‌స్టేషన్ మీదుగా కవాతు నిర్వహించాయి. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం ఎస్సై సుధాకర్ ఉన్నారు.